సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి



బహుమతులు అందజేస్తున్న నల్ల వెంకట్‌రెడ్డి తదితరులు

కీసర: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం కీసరలోని వివిధ కాలనీల్లో భోగి పండుగ సందర్భంగా ముగ్గులు వేసిన మహిళలు, యువతులకు బీజేపీ నేత నల్లవెంకట్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ పెద్ద పండుగ అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ ముందు తరాలకు పండుగల విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

అయోధ్య పాదయాత్రికుడికి సన్మానం



గిరికి స్వాగతం పలుకుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, భజరంగ్ దళ్ కార్యకర్తలు

ఘట్‌కేసర్: అయోధ్య రాముడిని దర్శించుకునేందుకు కాలినడకను వెళుతున్న వ్యక్తిని భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. అంబర్‌పేట్‌కు చెందిన న్యాయవాది గిరి రామమందిర నిర్మాణం పూర్తయిన సందర్భంగా అయోధ్య వరకు పాదయాత్ర చేపట్టారు. వరంగల్ జాతీయ రహదారి అవుషాపూర్ వద్ద ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం పూలమాలతో సన్మానించి గ్రామ సరిహద్దు వరకు ఆయనతో నడిచారు. కార్యక్రమంలో అవుషాపూర్ సర్పంచ్ కావేరి, బజరంగ్ దళ్ కార్యకర్తలు శ్యామ్‌కిరణ్, అరవింద్, మశ్చేందర్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీను, సలీం, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

కౌండిన్య గౌడ సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కేశవ నాథంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్

ఘట్‌కేసర్: పట్టణంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద కౌండిన్య గౌడ సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీటీసీ కేవశ నాథంగౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు రమాదేవి, ఆంజనేయులుగౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో సురేశ్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్, కిశోర్‌గౌడ్, రాజుగౌడ్, రమేశ్‌గౌడ్, కృష్ణప్రసాద్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..



కీసర: మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వేల్పుల శ్రీనివాస్, అధ్యక్షుడు చిందం మహేందర్, ప్రధాన కార్యదర్శిశ్రీనివాస్, కోశాధికారి వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు కె. వెంకటేశ్వర్, సలహదారులు విష్ణుకుమార్, వెంకటేష్, నరేష్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

మేడ్చల్: మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామ మున్నూరు కాపు సంఘం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్ ను మున్నూరు కాపు కుల సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ కేలండర్‌ను గ్రామంలోని మున్నూరు కాపు కులానికి చెందిన ప్రతి ఇంటికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరేష్‌పటేల్, వెంకటరాంపటేల్, వేణుగోపాల్‌పటేల్, సంతోష్‌భాను పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఆర్ కోసం సేకరించిన భూములను స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి ఈశ్వర్

పోచారం: ఔటర్ రింగ్ రోడ్డు కోసం ఘట్‌కేసర్ కూడలి వద్ద సేకరించిన భూములను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ అన్నారు. ఆదివారం అన్నోజిగూడలోని వికలాంగుల కాలనీలో జరిగిన సీపీఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణ సమయంలో ప్రభుత్వం సేకరించిన భూములు ఇంకా ఇతరుల అధీనంలోనే ఉన్నాయని, వాటిని వెంటనే స్వాధీనం చేసుకుని సర్వీసు రోడ్డు నిర్మించాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకుడు జయచంద్ర, కౌన్సిల్ సభ్యులు సదాశివ, అన్వర్, సరిత, అనంతలక్ష్మి, మురళి, యాదమ్మ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషిచేయాలి



ఘట్‌కేసర్: మహనీయుల జీవిత చరిత్ర తెలుసుకుని వారి ఆశయ సాధన కోసం కృషిచేయాలని మాజీ ఎంపీటీసీ మహేశ్, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యుడు ప్రవీణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్ ఒక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, సబ్బండ వర్గాల అభ్యున్నతికి ఎనలేని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, పాండుగౌడ్, నర్సింగ్‌రావు, బాలయ్య, రాందాస్, శ్రీనివాస్, రాజేశ్, వెంకటేశ్వర్లు, సత్యం, రఘు, అంజయ్య, విష్ణు, సాయిచరణ్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి బీజేపీలో లోకల్ లొల్లి

- పారాచూట్‌లకు టికెట్ వద్దంటూ స్థానిక నేతల అభ్యంతరం
- లోక్‌సభ సీటుపై రచ్చకెక్కిన వివాదం
- నియోజకవర్గం కేడర్‌తోసహా రాజకీయ వర్గాల్లో చర్చ

సాక్షి,మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న తెలంగాణ బీజేపీలో మల్కాజిగిరి లోకల్ లొల్లి తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒక వైపు పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు అధిష్టానం కసరత్తు చేస్తుండగా మరో వైపు మేడ్చల్ అర్బన్, రూరల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన నేతలు స్థానికులకే టికెట్ ఇవ్వాలని ఒత్తిడి తేవడం వివాదాలకు కారణమవుతోంది. మరికొందరు మల్కాజిగిరి టికెట్‌పై బహిరంగ చర్చకు దిగడాన్ని తప్పుపడుతూ...ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేస్తున్నారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి టికెట్ కోసం నేతల మధ్య నెలకొన్న లోకల్ లొల్లి పార్టీ కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది. పారాచూట్ లీడర్లకు టికెట్ ఇవ్వరాదంటూ మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాలకు చెందిన అధ్యక్షులు అధిష్టానానికి తేల్చి చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

తెరపైకి లోకల్ వివాదం..

మల్కాజిగిరి పార్లమెంట్ సీటుపై బయటి లీడర్ల పెత్తనం ఏమిటని స్థానిక నేతలు లోకల్ నినాదాన్ని తెరపైకి తెస్తున్నారు. మల్కాజిగిరి నుంచి పోటీ చేయాలని కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, మధ్య ప్రదేశ్ పార్టీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత కొమురయ్య చేపడుతున్న కార్యకలాపాలు స్థానిక నేతల కలవరానికి కారణమవుతున్నాయి. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు గత కొన్నాళ్లుగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తూ కేడర్‌తో సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరికొందరు ఫ్లెక్సీలు ,వాల్‌రైటింగ్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో స్థానికుల్లో మల్కాజిగిరి సీటుపై ఆందోళన నెలకొంది. నగరంలో ఇటీవల బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు వన్నాల హరీష్ రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి మీడియా సమావేశాన్ని నిర్వహించి, మల్కాజిగిరి పార్లమెంట్ టికెట్ స్థానికులకు తప్ప స్థానికేతరులకు ఇవ్వవద్దని పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో స్థానిక నాయకులు ,కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రాబోయే పురపాలిక, జీపీ ఎన్నికలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయమై కేంద్రమంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి , జాతీయ నాయకుడు ఎంపీ లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తాము ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతుంటే ఎంపీ టికెట్ కోసం బయటి వ్యక్తుల పేర్లు తెరపైకి తీసుకురావటమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో సమర్థవంతమైన నాయకత్వం ఉందని, ఏళ్ల తరబడి బీజేపీ కోసం పనిచేసిన నాయకులున్నారని, స్థానిక నేతలకు కాకుండా పారాచూట్ లీడర్లకు టికెట్ కేటాయిస్తే .. పార్టీ శ్రేణులకు తప్పుడు సంకేతాలు వెళ్లగలవని వారు హెచ్చరిస్తున్నారు.

గెలుపే లక్ష్యంగా...

ఇదిలా ఉండగా, మరికొందరు నేతలు మాత్రం బీజేపీ జాతీయ పార్టీ అని సిద్ధాంతాలకు కట్టుబడి ఉండటంతోపాటు అధిష్టానం మల్కాజిగిరి టికెట్ ఎవ్వరికి ఇచ్చినా గెలుపు లక్ష్యంగా పనిచేయాలంటున్నారు. ఈ మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మాజీ అధ్యక్షుడు, కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ విలువలు...కార్యకర్తల నిర్మాణంతో కూడిన పార్టీ అని, ఏ స్థాయి వారైనా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. పలు ఊహాగానాలతో మల్కాజిగిరి టికెట్ విషయంలో పార్టీని తప్పుపడుతూ... బహిరంగ చర్చకు దిగటం పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకమేనని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలకు బాధ్యత వహిస్తున్న నాయకులకు కనీస సూత్రాలు తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు. ఈ విషయాలను రాష్ట్ర అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని పలువురు పేర్కొంటున్నారు. మల్కాజిగిరి లోక్‌సభ టికెట్‌పై బీజేపీ నేతలు రచ్చకెక్కటం వంటి విషయాలు పార్టీ కేడర్‌తో సహా రాజకీయవర్గాల్లో వాడీవేడి చర్చ జరుగుతోంది.

రంగోళి పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రాగజ్యోతి, సర్పంచ్ గణేశ్

మేడ్చల్‌రూరల్: మండలంలోని మునీరాబాద్ గ్రామంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా రంగోళి పోటీలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గణేశ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగవల్లులతో ఆకట్టుకున్నారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కై రంకొండ ప్రవణికకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు రాగజ్యోతి, సర్పంచ్ గణేశ్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు, మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

మల్కాజిగిరి: కార్పొరేటర్ శ్రవణ్ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం బీజేపీ నాయకులు రాంబాబు, గొలికర్ ఆనంద్ ఆవిష్కరించారు. అనంతరం అయోధ్య పూజిత అక్షింతలు శివపురి కాలనీలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవదాస్,శివానంద్,రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్

బోడుప్పల్: చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో ఆదివారం ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రుచికరమైన వంటకాలు తయారు చేయడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారన్నారు. మహిళలు దైనందిన జీవితంలో ఎంతో బిజీగా ఉన్నా వంటలు చేయడానికి ప్రాధాన్యం ఇస్తారన్నారు. తమ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు తమ ఇళ్లల్లో వివిధ రకాల వంటకాలు వండుకుని తీసుకొచ్చారని, ఆ వంటకాలతో అందరం కలిసి ఒకేచోట విందు ఆరగించినట్లు తెలిపారు. ఇలాంటి ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు చేయూతనిద్దాం



బోడుప్పల్: సమాజంలోని వృద్ధులకు తమ వంతు చేయూతనివ్వాలని 1వ డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ అన్నారు. చెంగిచర్లలో బీజేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వృద్ధులు 50మందికి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలని, ఆనందమైన జీవితాన్ని గడపాలన్నారు. తమ డివిజన్ పరిధిలోని వృద్ధులు పండగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బింగి భాగ్యమ్మ, నేతలు బింగి యోగేష్‌యాదవ్, మేకల వెంకటేశ్ ముదిరాజ్, అంజయ్య, సింహాచారి, ఠాగూర్, రమేష్, వెంకటేశ్, రాజేష్, అభి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన ఉద్యమ జేఏసీ నేతలు



మేడ్చల్: తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో జేఏసీలో కీలకంగా పని చేసిన ఉద్యమ నాయకులు నాటి జేఏసీ చైర్మన్ కోదండరాంను కలిశారు. ఉద్యమకారుల సమస్యలను, వారికి సముచిత స్థానం కల్పనపై ప్రభుత్వంతో మాట్లాడాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ కన్వీనర్ సంజీవరావు, నాయకులు ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబురాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హరిదాసులు, చిన్నారులకు భోగిపళ్లు, గంగి రెద్దుల విన్యాసాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాముని సిద్ది ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కచేరిలో సంక్రాంతి పాటలు, కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షనగా నిలిచింది.

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతారాం

జవహర్‌నగర్: గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపారు. ఆదివారం ఆయన జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌ను గంజాయి రహితంగా తీర్చిదిద్దుతామని, గంజాయి విక్రయించినా, సేవించినా చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగలను ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఐ శ్రీనివాస్, ఎస్ఐ అనిల్‌కుమార్‌యాదవ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. గోదాదేవి కల్యాణం



శ్రీ గోదాదేవి అమ్మవారు



అలంకరించిన వివాహ వేదిక



చీర్యాల దేవాలయంలో..

మేడ్చల్‌రూరల్: మండల పరిధిలోని క్షేత్రగిరి వెంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోదాదేవి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అర్చకులు ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాజబొల్లారం తండా సర్పంచ్ మంగ్యానాయక్, ఎంపీటీసీ అంకితరవి, నాయకులు పాల్గొన్నారు.

యంనంపేట్‌లో..

పోచారం: యంనంపేట్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాయకస్వామి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనరెడ్డి, ఆలయ చైర్మన్ రాజేష్ గౌడ్, ఈఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చీర్యాల దేవాలయంలో..

కీసర: చీర్యాల దేవాలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణోత్సవాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి నిత్య పూజల అనంతరం మండపంలో కొలువైన గోదాదేవి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

ఎదులాబాద్ శ్రీ గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయక స్వామి ఆలయంలో సోమవారం జరుగనున్న గోదాదేవి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వివాహ వేదిక, మండపం, అమ్మవారిని అందమైన పూలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

పతంగుల పంపిణీ



మేడ్చల్: సంక్రాంతి పండగ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లో బీజేపీ నేతలు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రంతో రూపొందించిన పతంగులను పంపిణీ చేశారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఈ పతంగులను రూపొందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురెందర్‌రెడ్డి, విష్ణుగౌడ్, నాగార్జునరెడ్డి, నాగార్జున్, సంపత్ పాల్గొన్నారు.

ఘనంగా భోగి సంబురాలు

మేడ్చల్: భోగి పండగ సందర్భంగా మేడ్చల్, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలు, మేడ్చల్ మండలంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్ల ముందు రథాల ముగ్గులు వేసి, నవధాన్యాలు, ఆవుపేడలతో గొబ్బెమ్మలు తయారు చేసి గడపలలో పెట్టి, పాలు పొంగించి పూజలు చేశారు.

ఘట్‌కేసర్ మండలంలో..

భోగి సంబురాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయమే ఇంటి ముందర కల్లాపి చల్లి రంగులతో ముగ్గులు వేశారు. అనంతరం ముగ్గుల మధ్యన ఆవుపేడతో చేసిన గొబ్బిళ్లను ఉంచి రేగి పండ్లు, నవధాన్యాలతో అందంగా అలంకరించారు. యువత గాలిపటాలు ఎగురవేయడంతో సందడిగా మారింది. గాలిపటాలు విక్రయించే దుకాణాలు కిటకిటలాడాయి.



ఘట్‌కేసర్‌లో గాలిపటాల దుకాణంలో సందడి

వస్తాయా..? రావా..?

గొర్రెల పంపిణీపై సందిగ్ధం

- వాటా ధనం చెల్లించిన లబ్ధిదారుల్లో అయోమయం
- గొల్ల కుర్మల అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో
- గొర్రెల పంపిణీ పథకం
- జిల్లాలో 5,160 గొర్రెల యూనిట్లకు
- పంపిణీ చేసింది 3,913 యూనిట్లే.
- మార్గదర్శకాలు అందగానే పంపిణీ చేస్తామంటున్న అధికారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: గొల్ల, కుర్మ, యాదవుల్లో ఎక్కువ మందికి గొర్రెల పెంపకమే జీవనోపాధి, అయినా మాంసం దిగుమతులు చేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితి నుంచి ఎగుమతుల స్థాయికి చేరాలన్న లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పథకం కొనసాగుతుందా..?.. లేదా.. అన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో వాటాధనం చెల్లించిన వారిలో ఆందోళన నెలకొంది.



గ్రౌండింగ్ తీరు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొదటి, రెండో విడతలు కలిపి మొత్తంగా 5,160 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేయాలని అప్పట్లో లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గ్రామ సభలు నిర్వహించి గొర్రెల పంపిణీ కోసం వీరందరినీ లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. జిల్లాలో 2017 నుంచి గొర్రెల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. అయితే నిధుల కొరత కారణంగా పంపిణీలో జాప్యం జరుగుతోంది. ఇప్పటి వరకు 3,913 యూనిట్ల గొర్రెలను సంబంధిత లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

1147 మంది ఎదురుచూపులు

ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉంటాయి. యూనిట్‌కు గతంలో రూ.1.25లక్షలు ఉండగా ...ఆ తర్వాత రూ.50 వేలు పెంచడంతో అది రూ.1.75 లక్షలకు చేరింది. యూనిట్ విలువ పెంపుతో ప్రభుత్వం75 శాతం అంటే రూ. 1,31,250 రాయితీ కింద ఇవ్వనుండగా, లబ్ధిదారుడు మాత్రం తన వాటా కింద డీడీ రూపంలో రూ.43,750 చెల్లించాల్సి ఉండేది. డీడీల విధానంలోనూ మార్పులు చేశారు. ఆరు నెలల క్రితం లబ్ధిదారు బ్యాంకు ఖాతా నుంచే నేరుగా చెల్లింపుల విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. కొత్త విధానంలో 1147 మంది లబ్ధిదారులు తమ వాటా ధనం చెల్లించి,...గొర్రెల యూనిట్ల కోసం ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు గడిచినా. గొర్రెల పంపిణీపై ఇంకా ఏ విధమైన నిర్ణయం తీసుకోలేదు. గొర్రెల యూనిట్ మంజూరైతే ఆర్థిక ఉన్నతికి బాటలు పడతాయన్న ఆశతో అప్పులు చేసి వాటా ధనం చెల్లిస్తే గ్రౌండింగ్ నిధులు విడుదల అవుతాయో లేదోనని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది తమ వాటా ధనం తిరిగి ఇచ్చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ విషయమై జిల్లా పశుసంవర్థక శాఖ అధికార వర్గాలు మాత్రం .. గొర్రెల పంపిణీపై ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని పేర్కొంటున్నారు.